తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ| జనగాం |ములుగు నిర్మల్ |మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

శనివారం
10 జనవరి 2026

పేజీలు : 08



### ఆదివాసీ సాంప్రదాయాలకు నిలువుటద్దం

## మేడారం జాతర

- వందల ఏళ్ల చరిత్రకు శాశ్వత రాతి కట్టడాలు...!
- మేడారం అంతా ఆదివాసీల కళా ప్రతిమలతో దర్శనం...
- వనదేవతలకు సేవ చేసే భాగ్యం దక్కడం నా అదృష్టం : మంత్రి సీతక్క
- ఈనెల 18 లోపు అన్ని పనులు పూర్తి చేస్తాం..
- 21 శాఖ లను సమన్వయం చేస్తూ జాతరను పూర్తి చేస్తాం...

**మంగపేట జనవరి 09 (జనంసాక్షి) :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన తెలంగాణ కుంభమేళ మన మన 'మేడారం జాతర'.. ములుగు జిల్లా సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే వన దేవతల జాతరే మన మేడారం జాతర. మగశుద్ధ పౌర్ణమి నాడు నాలుగు రోజులపాటు నిర్వహించే వనదేవతల జాతరకు ఒక్క తెలంగాణ రాష్ట్ర ప్రజలే కాక చత్తీస్గడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా వంటి రాష్ట్రాల ప్రజలు కోట్లాది ప్రజలు హాజరవుతారు. అలాంటి తెలంగాణ కుంభమేళా జాతరగా పేరుందిన వనదేవతల జాతరను సుమారు 251 కోట్ల నిధులను మిగతా 9లో..

# పరిహారం కోసం పరిహాసం!



- డేంజర్ జోన్‌లో పెరుగుతున్న కొత్త ఇండ్లు
- వ్యవసాయ క్షత్రాల్లో నిర్మాణాలు
- సింగరేణి పరిహారం కోసం కొత్త వ్యూహాలు
- గడ్డిగానిపల్లి శివారులో వెలుగు చూసిన వైనం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** ప్రభుత్వం నిరుపేదలకు కట్టించే తరహాలో ఓ ఊరు శివారు వ్యవసాయ క్షత్రాల్లో కొత్త ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.. ఖరీఫ్ సీజన్ లో వరిపంటలు పండించి పంట చేతికి రావడం ముగిసింది.. ఇక ఆ క్షత్రాల్లో ప్రస్తుతం పుట్ట గొడుగుల్లా ఇండ్లు వెలుస్తున్నాయి.. వారి భూముల్లో వారు ఇండ్లు నిర్మించుకుంటున్నారు తప్పేంటి అనే అనుమానం అందరికి రావచ్చు.. కాని అది డేంజర్ జోన్ సింగరేణి సంస్థ సర్వే చేసి, పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకునే భూమి.. సింగరేణి కింద పోయే ఈ భూముల్లో ఒక్కసారిగా ఇండ్ల నిర్మాణాలు పెరిగిపోతుండడం ఆశ్చర్యకరంగా మారింది.. పరిహారం కాస్త పరిహాసంగా మారిందనే చర్చలు స్థానికంగా వినిపిస్తున్నాయి..

వార్త మెయిన్ 12లో

# కొత్తకొండ జాతరకు వేళాయె

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు షురూ
- కోరమీసాల స్వామికి కోటి మొక్కులు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు
- నేటి సాయంత్రం కల్యాణం
- పాల్గొననున్న మంత్రి పొన్నం ప్రభాకర్...

**భీమదేవరపల్లి, జనవరి 09(జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలోని ప్రసిద్ధి చెందిన వీరభద్ర స్వామి

భక్తుల కొంగుబంగారం కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి.మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 10న స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యే జాతర ఈ నెల 18న స్వామివారి గ్రామ పర్యటనతో ముగుస్తుంది. ఇప్పటికే స్వామివారి కల్యాణ మహోత్సవ వేదిక అందంగా ముస్తాబైంది. జాతరకు తెలంగాణ పలు జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.కోరిన కోర్కెలు తీర్చాలని స్వామి వారికి కోరమీసాలు సమర్పిస్తారు.జాతరలో భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఈవో కిషన్‌రావు తెలిపారు.కాగా జాతర ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు.

కాకతీయ రుద్రేశ్వరుని కాలంలో మల్లికార్జున పండితుని మనుమడు కేదారి పండితునిచే వీరభద్రస్వామి ఆలయం శైవాగమానుసారం ప్రతిష్టింపబడినట్లు స్థలపురాణం చెబుతున్నది. క్రీ.శ.1600 సంవత్సర ప్రాంతంలో కొంతమంది కుమ్మరులు కొండపైకి ఎడ్లబండ్లు కట్టుకుని వెళ్లారు.అక్కడ వారికి అవసరమయ్యే కర్రలు కొట్టుకుని ఎడ్లబండ్లలో వేసేందుకు చూడగా ఎద్దులు,బండి కనిపించలేదు. వారు కొండచుట్టూ కలియతిరిగి అలసిపోవడంతో ఆ రాత్రి కొండపైనే నిద్రించారు.వీరభద్రస్వామివారు కలలో వారికి కనిపించి నన్ను ఈ కొండపై నుంచి దింపి కింద ఉన్న ఆలయంలో ప్రతిష్ఠింపమని వారిని ఆజ్ఞాపించారు.దీంతో కేదారి పండితునిచే స్వామివారిని కిందకు దింపి ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ నెల 10న సాయంత్రం వీరభద్రస్వామి



వారి కల్యాణం, 14న భోగి పండుగ, 15న మకర సంక్రాంతి పర్వదినాన బండ్లు తిరుగుట, 16న కనుమ,నందీశ్వర అభిషేకం,పూష్ప యాగం, 17న త్రిశూల స్నానం, 18 తెల్లవారుజామున అగ్నిగుండాలు, అదేరోజున సాయంత్రం స్వామివారి గ్రామ పర్యటనతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా స్వామివారి ఆలయంలో దేవతావృక్షలు రుద్రాక్ష, జమ్మి,మర్రి,వేప,జుబ్బి, మిగతా 9లో..

## ఘనంగా లూయిస్ బ్రెయిలీ 207వ జయంతి వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలోని హెచ్‌ఎంఆర్‌డిఎస్ కేంద్రంలో గురువారం లూయిస్ బ్రెయిలీ 207వ జయంతి వేడుకలు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, లూయిస్ బ్రెయిలీ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడని అన్నారు. బ్రెయిలి లిపిని కనుగొని మొదటగా ఉన్న 12 చుక్కల బ్రెయిల్ లిపిని ఆరు చుక్కలుగా సరళీకృతం చేసి ప్రపంచవ్యాప్తంగా అంధులకు చదువు, జ్ఞానం అందించిన మహోన్నత వ్యక్తిగా లూయిస్ బ్రెయిలీ నిలిచారని తెలిపారు. ఆయన అంధులకే కాకుండా సమాజమంతటికీ ఆదర్శప్రాయుడని ఆమె పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ ఆవిష్కరణ అంధుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఆర్‌డిఎస్ కేంద్ర నిర్వాహకులు రజిత, రాజయ్య, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అర్జున్, క్రిష్ణ, సురేష్, హెచ్‌ఎంఆర్‌డిఎస్ సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

## సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**మరిపెడ జనవరి 9 (జనంసాక్షి )** సంక్రాంతి అంటే పెద్ద పండుగని,పంటల పండుగని, పెద్దల పండుగని,పశువుల పండుగ?పుడమి పుస్తకంలో ప్రకృతి రాసుకున్న మధురమైన కవిత. గీసుకున్న అద్భుతమైన చిత్రిక. హరితవర్ణపు చీరను కట్టుకుని, బంతి చేమంతులను జడలో తురుముకుని ..రంగవల్లికల రంగుల దారిలో నడిచి వచ్చే సంక్రాంతి దేవతను చూసి మురిసిపోని మనిషి వుండడని. సంబరపడని కర్షకుడు వుండడని. మనిషికి తెలిసిన తొలి పండుగ సంక్రాంతే! బీడు నేలను దుక్కి దున్ని పంటసిరిగా మార్చిన మానవుడికి ఇదే తొలి పండుగ అని సీతారాంపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోత్ అర్జున్ నాయక్ అన్నారు.అప్పట్నుంచే మనిషి జీవితం బహు ముఖాలుగా, బహు విధాలుగా వికసించిందని,అభ్యున్నతి దిశగా అడుగులు వేసిందని అన్నారు. దీనంతటికి కారణం సూర్యుడు. సూర్య భగవానుడే మనకు జీవాధారమని,సమస్త జీవరాశికి, వృక్షజాతి మనుగడకు ఆయనే కారణం అని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలు ఉద్దేశించి మాట్లాడుతూ సంక్రమణం అంటే గమనం. సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి అడుగు పెట్టడాన్ని సంక్రమణం అంటామని,ఏడాదిలో సూర్యుడు పన్నెండు రాశులలో ప్రవేశిస్తాడని. ఈ నెలలో ప్రవేశించేది మకర రాశిలోకి. అందుకే ఇది మకర సంక్రాంతి అయ్యిందని,పుష్యమాసంలో వచ్చే మకర సంక్రమణం ఉత్తరాయణానికి నాంది, పుణ్యప్రదం కూడా.అందుకే మకర సంక్రాంతి శుభవేడుకగా మారిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మంగీలాల్, లింగాల మహేష్ గౌడ్,కవిత, వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి, సందీప్, సారిక,విద్యార్థని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అమీనాబాద్ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### చెన్నారావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు సిద్దన రమేష్



**చెన్నారావుపేట, జనవరి 9 ( జనం సాక్షి):** అమీనాబాద్ గ్రామాన్ని గ్రామస్తులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెన్నారావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్ అన్నారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ దార రంజిత్ తో కలిసి డోజర్ ట్రాక్టర్ సహాయంతో పరిసరాలను శుభ్రం చేయించారు. గ్రామ ప్రజలు గ్రామంలో పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. అమీన్ సాగర్ చెరువు కట్టకు చెత్తాచెదారం ఎక్కడబడితే అక్కడ పడేయకుండా ఉండాలని మలవిసర్జన చేయకూడదని కోళ్ల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకూడదని సూచించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వీధుల్లో తిరిగినప్పుడు అందులో చెత్తాచెదారాన్ని పడవేయాలని ఇది మన అందరి బాధ్యత అన్నారు. అమీనాబాద్ గ్రామ చెరువు (అమిన్ సాగర్) కట్టకు ఇరువైపుల ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షులు, అమీనాబాద్ ఉప సర్పంచ్ బండి హరీష్, అమీనాబాద్ కార్యదర్శి నిట్టు, వార్డు సభ్యులు దయ్యాల రాజు, గుండెబోయిన రమేష్, ఊరుగొండ కుమారస్వామి, అయిత రామ్మోహన్, మేకల కుమారస్వామి, మంద శ్రావణ్, ఊరుగొండ సంపత్, మరాఠీ ప్రశాంత్, పాల్గొన్నారు.

# రైతుల శ్రేయస్సు కోసం కృషి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### పంటల కోసం భీమ్ ఘన్పూర్ చెరువు నీరు విడుదల



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామంలోని భీమ్ ఘన్పూర్ చెరువు నీటిని యాసంగి పంటల సాగు కొరకు గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చెరువులో పూలు చల్లి, గేట్ వాల్వ్ తిప్పి నీటిని దిగువ గ్రామాలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. చిట్టచివరి ఎకరా వరకు సాగు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సాగునీటి విడుదలతో దిగువ గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు

**- యువతలో ఆత్మవిశ్వాసం పెంచేందుకే సీఎం కప్..**

క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంచాలనే సంకల్పంతో సీఎం కప్ 2025 - 26 ఏర్పాటు చేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే జీఎస్సార్ సీఎం కప్ క్రీడాజ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించి, విద్యార్థులతో కలిసి కొద్దిదూరం ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి క్రీడాకారుడిని రాష్ట్రస్థాయి వేదిక వరకు తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం కప్ ద్వారా క్రీడలను జీవితంగా మార్చుకునే అవకాశాన్ని యువతకు అందిస్తామన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రతిభ ఉన్న క్రీడాకారుల భవిష్యత్తు వృధా కాకూడదని, యువత క్రీడల్లో ముందుకు రావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ లీడర్లు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలు



**చెన్నారావుపేట, జనవరి 9( జనం సాక్షి):** మండలంలోని లింగాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు అందమైన రంగురంగుల ముగ్గులను వేసి పలువురిని ఆకట్టుకున్నారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయురాలు కల్పన, ఆయా రచన, ఓరుగంటి రమేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల నిర్మాణంలో మనమే ఫస్ట్ ఉండాలి

### ఆఫీసర్లు సమన్వయంతో కృషి చేయాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### భూపాలపల్లి జిల్లా అధికారులతో సమీక్ష

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇందిరమ్మ డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణంలో భూపాలపల్లి నియోజకవర్గం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచేలా ఆఫీసర్లు సమన్వయంతో కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణంపై గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో సకాలంలో ఫోటో క్యాప్చర్ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. ఇండ్లు మంజూరు కాబడిన లబ్ధిదారులు 45 రోజుల్లో నిర్మాణం ప్రారంభించకుంటే రద్దు చేయాలని స్పష్టం చేశారు. ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, గృహ నిర్మాణ శాఖ ఏఈలుసమన్వయంతో నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణం చేపట్టేందుకు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే పరిస్థితులు లేని లబ్ధిదారులకు లక్ష రూపాయల సహాయం అందించాలని సూచించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల ఖర్చులపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నిధుల సమస్య ఏమీలేదని, బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తే నిధులు మంజూరు అవుతాయని స్పష్టం చేశారు. ప్రగతిలో ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ



సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పీడి లోకిలాల్, పిఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీకాంత్, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఎంపిడిఓలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు సర్వీస్ ను సద్వినియోగం చేసుకోవాలి

## పాంబండ తండా సర్పంచ్ మాలోత్ మాలి ఉమ్లా

## బస్సు ఏర్పాటుతో పాంబండ తండావాసుల హర్షం



**మరిపెడ జనవరి 9 (జనంసాక్షి)** నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మాలోత్ మాలి ఉమ్లా అన్నారు. శుక్రవారం బస్సు గ్రామాలకు చేరుకోగా సర్పంచ్ మాలి తండా పెద్దలు, నాయకులతో కలిసి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం మహబూబాబాద్ నుండి బయలుదేరిన బస్సు కురవి, మరిపెడ, గిరిపురం క్రాస్ రోడ్, పాంబండ తండా, తాళ్ళ ఊకల్, తానంచర్ల మీదుగా సూర్యాపేటకు చేరుకుంటున్నారు. మధ్యాహ్నం సూర్యాపేట నుండి బయలుదేరిన బస్సు నూతనకల్, తానంచర్ల, తాళ్ళ ఊకల్, పాంబండ తండా, గిరిపురం క్రాస్ రోడ్, మరిపెడ బంగ్లా మీదుగా మహబూబాబాద్ కు చేరుకుంటున్నారు. అదేవిధంగా సాయంత్రం కూడా బస్సు సర్వీస్ ఉంటుందన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పాంబండ తండా మీదుగా మహబూబాబాద్ నుండి సూర్యాపేట, సూర్యాపేట నుండి మహబూబాబాద్ కు బస్సు సర్వీసు నడుస్తుందని తెలిపారు. ఈ బస్సు సర్వీస్ ను గ్రామస్తులు, తండవసులు, పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్టిసి బస్సు ఏర్పాటుతో మరిపెడ మండలంలోని పాంబండ తాండవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోతు ఇరానీ, వార్డు మెంబర్లు బిచ్చు, నరేష్, బద్రు, అరుణ, సునీత, తండా పెద్దలు రెడ్యా ,నాయకులు గోపి, వెంకన్న, బాలరాజు, రెడ్యా, రవి ,కుమార్, నాగరాజ్ లోకేష్,బాబు,బాలు, మంగ్యా,నరేష్, మల్సూర్ ,సక్రం సోమ్లా నరహరి లాల్ సింగ్ యుగంధర్ వీరన్న తండా పెద్దలు, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య మిత్రునికి కుటుంబానికి ఆర్థిక సహాయం



**శాయంపేట, జనవరి 9 (జనం సాక్షి)**శాయంపేటమండలంలోని మంత్రి రవీందర్ అనారోగ్యంతో మరణించగా తమతో పాటు 1982 – 83 సంవత్స రం లో 10 వ తరగతి వరకు చదువుకున్న బాల్య మిత్రులు తమ మిత్రుని కుటుంబానికి రూ51,050 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో పాటుగా ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు తమతో పాటుగా చదువుకుని మాలో ఒకడిగా ప్రేమ అభిమానాలను పంచుకొని ఆదర్శవంతంగా ఉన్న తమ బాల్య మిత్రుడు ఈరోజు మా మధ్యన లేనందుకు చాలా బాధాకరమని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఆయన తమతో గడిపిన మధుర స్మృతులలో గుర్తు చేసుకుని తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు వలపుదాస్ రమేష్,బాసని జయప్రకాశ్, గౌరోజు రాజేంద్ర ప్రసాద్,బొల్లోజు రవీంద్ర చారి, పసునూటి ప్రకాష్, వినుకొండ శంకరాచారి, రేణికుంట్ల ఐలయ్య, బాసని సంబయ్య, దామర కొండ కుమారస్వామి, దుబాసి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురులో సంక్రాంతి ముందస్తు ముగ్గుల పోటీలు

## విజేతలకు బహుమతుల ప్రదానం



**తొర్రూరు/ నెల్లికుదురు, జనవరి 9 (జనం సాక్షి) :** సంక్రా ంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తుగా ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో కళాశాల విద్యార్థినీలు అధిక సంఖ్యలో పాల్గొని సంక్రాంతి పండుగ ప్రత్యేకతను, వ్యవసాయ ప్రాముఖ్యతను, గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఆకర్షణీయమైన రంగురంగుల ముగ్గులు వేసి తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆరిగకూటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి వంటి పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తాయని అన్నారు. విద్యార్థులు ఆధునిక విద్యతో పాటు సంప్రదాయ విలువలను కూడా అలవర్చుకోవాలని, ఇటువంటి కార్యక్రమాలు వారి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతా భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. సంప్రదాయ కళలకు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు యువతలో సాంస్కృతిక చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ముగ్గుల పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజేతలను అభినందిస్తూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల అంతర్లీన ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బండి శ్రీనివాస్, ముక్కెర ప్రకాష్ బాబు, బంటు కవిరాజ్, రఘురాం, నాగేశ్వరరావు, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, సుధాకర్, మహేందర్, బాబు, యాకన్న, సతీష్, సుభాష్ కళాశాల సిబ్బంది ప్రదీప్, గౌరీశంకర్, లక్ష్మణ్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# 12న మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు

## అమీనాబాద్ గ్రామ సర్పంచ్ దార రంజిత్



**చెన్నారావుపేట, జనవరి 9 ( జనం సాక్షి):** మండలంలోని అమీనాబాద్ గ్రామంలో సంక్రాం తి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ దార రంజిత్ శుక్రవారం తెలిపారు. 12వ తేదీన ఉదయం 7 గంటలకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ. 3016, ద్వితీయ బహుమతి రూ. 2016, తృతీయ బహుమతి రూ. 1016 తో పాటు ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రత్యేక బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. మహిళలకు ముగ్గులు వేయడానికి రంగులను గ్రామపం చాయతీ ఆధ్వర్యంలో అందించడం జరుగుతుందని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# అభ్యాస స్కూల్‌లో కొలువు తీరిన బొమ్మల కొలువు

## అలరించిన రంగవల్లులు

**వరంగల్ లిస్ట్, జనవరి 09 (జనం సాక్షి)**వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని శంభునిపేట గణేష్ నగర్ లో గల అభ్యాస స్కూల్ లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఘనంగా ముగ్గుల పోటీలు ప్రారంభం మన సంస్కృతి సంప్రదాయాల మీద అవగాహన కల్పించడం అభ్యాస స్కూల్ కి ఉన్న ఒక ప్రత్యేకత విద్యార్థిని లలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వెలుగులోకి తీసుక రావడమే కాక ఒక్కొక్క రంగులో ఒక్కొక్క రీతిగా రంగవల్లులు తీర్చిదిద్ది వాటికి గల ప్రాధాన్యతను చక్కగా వివరించారు పాఠశాల డైరెక్టర్ శ్రీ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ ప్రిన్సిపాల్ మండల శిరీష మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని అభ్యాస స్కూల్ లో ఏ పండుగైన గణంగా జరపడమే కాక వాటి యొక్క విలువలను ప్రతి విద్యార్థికి తెలియజేయడమే అభ్యాస స్కూల్ లక్ష్యం అని అన్నారురహమత్ మేడం మాట్లాడుతూ కేవలం విద్యార్థి పూర్తకాలకే పరిమితం కాకుండా చదువుతో బాటు సంస్కృతి మానవీయ విలువలు తెలియజేస్తూ విద్యార్థి లో దాగిఉన్న కళల ను వెలికితీయడం అభ్యాస స్కూల్ కి పెట్టింది పేరు అని అన్నారు బొమ్మలకొలువు కు పెట్టింది పేరు సంక్రాంతి అంటేనే అంబురాల పండుగ అని అన్నారు ఇంచార్జ్ కోల రాము మాట్లాడుతూ ప్రతి ఇల్లు ప్రతి విద్యార్థి మనసు రంగవల్లి రంగు లాగ సుఖ సంతోషాలతో విలసిల్లాలని ప్రతి విద్యార్థికి ఆల్ రౌండ్ డెవలప్ మెంట్ అందిస్తుంది అభ్యాస స్కూల్ అని అన్నారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేహమత్ మేడం స్కూల్ ఇంచార్జ్ కోల రాము రజిని భారతి ప్రియాంక సుమయా రబ్బానీ ప్రణయ్ జీవన్ మరియు ఉపాధ్యాయులు గౌరవ తల్లి దండ్రులు పాల్గొన్నారు విద్యార్థినులు వేసిన రంగవల్లులు ఆకర్షణీయంగా ఉన్నాయి అనంతరం గెలుపొందిన విద్యార్థిని లకు బహుమతులు అందించారు యాంకర్ గా ఇబహ్ ఇరం చేశారు



# ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెల్లికుదురులో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా విజయవంతం



**తొర్రూరు నెల్లికుదురు జనవరి 9 (జనం సాక్షి):** ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెల్లికుదురు లో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంగా ముగిసిందని ఎస్ఐ చిర్రా రమేష్ బాబు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ముఖ్య లక్ష్యంతో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేయగా, కళాశాల విద్యార్థులు మరియు స్థానిక యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ ప్రైవేట్ మరియు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి నియామక ప్రక్రియ చేపట్టారు. పలువురు అభ్యర్థులు తక్షణమే ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరికొందరిని తదుపరి దశల కోసం షార్ట్‌లిస్ట్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎస్ఐ చిర్రా రమేష్ బాబు హాజరై మాట్లాడుతూ, యువత చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే జీవన ప్రమాణం మెరుగుపడుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ భూక్యా స్రవంతి మాట్లాడుతూ, యువతకు ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించడమే ప్రథమ్ సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ, సమాజాభివృద్ధి మరియు యువత ఉపాధి సాధనలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. జాబ్ మేళా విజయవంతానికి కృషి చేసిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రథమ్ సంస్థ ప్రతినిధులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# క్రీడల ద్వారా మంచి ఆరోగ్యం




**గూడూరు,జనవరి 09(జనంసాక్షి)**క్రీడాలతో మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని అధికారులు తెలిపారు.సీఎం కప్ 2026 రెండవ ఎడిషన్ క్రీడలకు సంబంధించిన క్రీడా టార్చ్ ర్యాలీ శుక్రవారం గూడూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల నుండి అంబేద్కర్ సెంటర్ వరకు క్రీడాజ్యోతి ర్యాలీ జరిగినది.ఈ ర్యాలీలో గూడూరు మండల తహసిల్దార్ నాగభవాని,జిల్లా యువజన క్రీడ అధికారి జ్యోతి, సీఐ సూర్యప్రకాష్,ఎస్సై గిరిధర్ రెడ్డి,ఎంఈఓ రవికుమార్, గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మలు నాయక్, ప్రధానోపాధ్యాయులు సుజాత, సత్యనారాయణ,పీడీలు బిక్షపతి, వెంకటేశ్వర్లు,పుష్పనీల,వార్డు మెంబర్లు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కఫ్ క్రీడలు గ్రామ,మండల, డివిజన్,జిల్లా,మరియు రాష్ట్రస్థాయిలో అన్ని రకాల క్రీడలు నిర్వహించబోతుందని,ఈ అవకాశాన్ని క్రీడాకారులు, క్రీడాభిమానులు సద్వినియోగం చేసుకోవాలని,మంచి ఆరోగ్యాన్ని క్రీడల ద్వారా పొందవచ్చని పిలుపునిచ్చారు.ర్యాలీ అనంతరం టార్చ్ కొత్తగూడ మండలం వైపుగా బయలుదేరి పోవడం జరిగిందని తెలిపారు.

# పేదలకు అండగా ప్రభుత్వం

### భవానీగూడలో కలెక్టర్ చేతుల మీదుగా చలి దుప్పట్ల పంపిణీ



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి):** జిల్లాలోని నిరుపేదలకు, అవసరార్థులకు జిల్లా యంత్రాం గం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బేల మండలంలోని భవానీగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పేదలకు చలి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు.చలికాలంలో తమ అవసరాలను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేసినందుకు కలెక్టర్ కు, అధికారులకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారుకార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, తహసీల్దార్ రఘునాథ్ రావు, ఎంపీడీవో ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ సునీత, పంచాయతీ కార్యదర్శి, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కరాటేలో గెలుపొందిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**గూడూరు,జనవరి09(జనంసాక్షి):** కరాటేలో గెలుపొందిన విద్యార్థులకు,ఉపాధ్యాయులకు శుక్రవారం గూడూరు మండలం మచ్చర్ల గ్రామపంచాయతీ పరిధిలోని జిపిఎస్ పాఠశాలలో అనేక ప్రాంతాల్లో జరిగిన కరాటే విభాగంలో గెలుపొందిన విద్యార్థులను గుర్తించి,వారికీ ఏ హెచ్ఎస్ స్పోర్ట్స్ స్కూల్ బాలుర కొత్తగూడ ఉపాధ్యాయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అవార్డు గ్రహీత ఎస్ఏ రేగ పాపారావు,వార్డెన్ పెనక ప్రభాకర్,బోడ మంగీలాల్,అల్లెం వెంకటయ్య,వీరందరు కలసి కరాటేలో గెలుపొందిన విద్యార్థులకు,ఉపాధ్యాయులకు తమ సొంత ఖర్చులతో శాలువాలతో ఘనంగా సత్కారించినారు.విద్యార్థులకు ముగ్గుల పోటీలు.... అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో జడ్జిమెంట్ గా వ్యవహరించిన గ్రామ మహిళలు ఈసం విమలత, కొట్టెం స్వాతి,కొట్టెం అంజలి,కొట్టెం నిరోషా,లు జడ్జిమెంట్ గా వ్యవహరించిన గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముయ్య బోయిన వెంకన్న ఉపాధ్యాయులు చుంచ లక్ష్మయ్య, రేగ సాంబయ్య,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ అక్షర లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**ముధోల్, జనవరి 09( జనం సాక్షి)** నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని శ్రీ అక్షర పాఠశాలలో యాజమాన్యం పిల్లలకు సంక్రాంతి పండగ విశిష్టతను తెలియజేసేందుకు శుక్రవారం విద్యార్థి విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించింది. హరిదాసుల కథలు, పురాతన కాలంలో మాదిరి పిడకల పొయ్యిపై పరమాన్నం వండడం, పూరి గుడిసెల ప్రజల అలంకరణలు ఆకట్టుకున్నాయి.విద్యార్థులు పూరి గుడిసెలను నిర్మించి పల్లెటూరి వాతావరణంలో పాఠశాలలో ఏర్పరిచారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను తెలియజేసి ముగ్గుల పోటీలను, గాలిపటాల, నృత్యాలను, పాటల పోటీలను నిర్వహించడంతో పాఠశాల ఆవరణ పండగ వాతావరణాన్ని తలపించింది. ముఖ్యంగా పల్లెటూరి బావి, పూరి గుడిసె, బండేడ్ల జోడి, కోడి పందెం లను విద్యార్థులు అట్టముక్కలతో తయారు చేయడంతో అందరినీ ఆకట్టుకుంది.




పాఠశాల డైరెక్టర్ సుభాష్ మాట్లాడుతూ ప్రతి పండగ యొక్క విశిష్టతను తెలుసుకోవడం తప్పనిసరి అందుకే పాఠశాల ఆవరణలో విద్యార్థులకు పండగ విశిష్టతను తెలియజేసి వారిని ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేసి విద్యార్థులను ఉత్సాహ పరిచినట్లు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సాయికుమార్, అకాడమిక్ ఇంచార్జ మధుసిందే, ఉపాధ్యాయులు మహేందర్, సంతోష్, మహేందర్, విద్యార్థులు తదితరులున్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి జనవరి 9 (జనం సాక్షి) :** హనుమకొండబాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 81 మంది లబ్ధిదారులకు రూ.25,86,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రజల ఆరోగ్యం విషయంలో అత్యంత బాధ్యతతో వ్యవహరిస్తూ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని స్పష్టం చేశారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నవారికి రాజకీయాలు, పార్టీ భేదాలు ఏమాత్రం అడ్డుకావని, సహాయం కోసం వచ్చిన ప్రతి అర్హుడికి సీఎం సహాయనిధి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.గత పాలకుల కాలంలో సహాయ నిధుల కోసం దళారీ వ్యవస్థ రాజ్యమేలిందని, ప్రజలు చెక్కు పొందాలంటే డబ్బులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితికి పూర్తిగా తెరదించామని చెప్పారు. ఎవరికీ నయా పైసా ఖర్చు లేకుండా, నేరుగా లబ్ధిదారుల చేతుల్లోకి చెక్కులు అందే విధంగా వ్యవస్థను సులభతరం చేశామని పేర్కొన్నారు.ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వేగంగా పరిష్కారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అర్హత కలిగిన వారికి సహాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# చెరువు పూడిక తీత పనులు ప్రారంభం



**రామకృష్ణాపూర్, జనవరి 09(జనంసాక్షి):** మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.రాధాకృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం రామకృష్ణాపూర్ ఆర్కేపీ ఓ.సీ. సమీపంలో గల అమరవాది చెరువు యొక్క పూడిక తీయు పనులను ఎస్.ఓ.టు జి.ఎం జి.ఎల్ ప్రసాద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పూడిక పనులను సింగరేణి సంస్థ యొక్క సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా చేపడుతున్నట్లు వారు చెప్పారు. ఈ చెరువు యొక్క మొత్తం విస్తీర్ణం సుమారు 131 ఎకరాలు ఉంటుందని,ఈ పూడిక తీసి వేయడం వలన భూగర్భ నీటి లభ్యత పెరుగుతుందని, మత్స్యకారులు చేపలు పెంచుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో మందమరి ఏరియా డీ.జీ.ఎం పర్సనల్ అశోక్, సివిల్ ఎస్.ఇ శ్రీధర్, ఆర్కే ఓ సి ఇంచార్జ్ మేనేజర్ పంకజ్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శారద, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



**ముధోల్, జనవరి 09( జనం సాక్షి)** ముధోల్ మండలానికి చెందిన ఎడిబిడి గ్రామంలోని ఫ్యూచర్ కాన్సెప్ట్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులు మన పండగలను మర్చిపోకుండా ఉండేందుకే పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించడం జరిగిందని అన్నారు. విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలియజేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థినిలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వశిష్ట హైస్కూల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

**నిర్మల్ రూరల్, జనవరి09,(జనంసాక్షి)** స్థానిక వశిష్ఠ హై స్కూల్ ఆదర్శ్ నగర్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థినీలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.విద్యార్థులు పతన్గులు ఎగురవేశారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను ఆచరిస్తూ వాటిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణ ముఖ్య పండుగ లలో సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందన్నారు ప్రతిఇంట సంక్రాంతి ముగ్గులు, పిండివంటలు, భోగిమంటలు కాస్తూ,గంగిరెద్దుల నృత్యాలు, తదితర కార్యక్రమాలతో కనువిందు చేస్తాయని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గొల్లపల్లి మాధవి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# క్షేమంగా గమ్యస్థానాలకు చేరడమే మనందరి లక్ష్యం



**వరంగల్ బ్యూరో, జనవరి 09 (జనం సాక్షి)** ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే మనందరి లక్ష్యంగా మార్చుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ పిలుపు నిచ్చారు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకోని నగర ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలతో పాటు హెల్మెట్ ప్రాదాన్యతపై అవగాహన కల్పించడం కోసం వరంగల్ ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో బైక్ ర్యాలీని ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా హజరయి ర్యాలీ ప్రారంభించిన అనంతరంపోలీస కమిషనర్సై తంఅది కారులు,సిబ్బందితో కలసి హెల్మెట్లను ధరించి బైక్ ర్యాలీ పాల్గోన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ మైదానం నుండి ప్రారంభమైన హన్మకొండ చౌరస్తా, ములుగు రోడ్, యం.జి.యం, పోచమ్మమైదానంలోని ఎస్.ఆర్ కళాశాల వరకు కొనసాగింది. అనంతరం విధ్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్య మారిందని, ముఖ్యంగా ఈ ప్రమాదాలు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడమే కారణరమవుతోందని. ప్రధానం హత్యలు కన్నా రోడ్డు ప్రమాదాల కారణంగా మరణించిన వారి సంఖ్య అధికమని. పోలీసులు, ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడితే కొద్ది వరకు రోడ్డు ప్రమాదాలను నివారించగలం కాని వాహనదారులు తమ వ్యక్తిగత బాధ్యతగా భావించి ట్రాఫిక్ నిబంధనలను పాటించడం అవలంబిస్తే ప్రస్తుతం జరిగే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టగలమని, గత ఏడాది వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన రొడ్డు ప్రమాదాల కారణంగా 450కు పైగా మృత్యువాత పడ్డారని, అలాగే తోమ్మిడి లక్షల మంది వాహనదారులకు హెల్మెట్ ధరించని కారణంగా జరిమానాలు విధించడం జరిగిందని. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపటం కారణంగా వాహదారునితో పాటు ఇతరులు సైతం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని. ప్రతి వాహన దారుడు హెల్మెట్ ధరించాలని, మైనర్లను వాహనాలను అందజేయవద్దని, కారు నడిపే సమయంలో తప్పని సరిగా సీట్ బెల్ట్ ధరించడంతో ఇతర ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా మీ ఇండ్లకు చేరుకోవాలని, రోడ్డు భద్రతతో పాటు, ప్రస్తుత రోజుల్లో మత్తుపదార్థాల, సైబర్ నేరాలు సైతం ప్రస్తుతం మనందరి ముందు పెద్ద సమస్యని, యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దని, వాటిని వినియోగించడం ద్వారా భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, ఎవరైనా మట్టు పదార్థాలు వినియోగించిన, విక్రయించిన పోలీసులకు సమచారం ఇవ్వాలని, అలాగే సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తం వుందాలని, తప్పుడు ప్రకటనలు, ఉచితాలు, ఉద్యోగాలు, లక్కీడ్రా, డిజిటల్ అరెస్టులను ప్రజలు నమ్మవద్దని, ఎవరైన సైబర్ నేరానికి గురైతే తక్షణమే 1930 నంబర్‌కు సమచారం అందించాలని పోలీస్ కమిషనర్ విద్యార్థులకు సూచించారు.అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమములో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, వరంగల్ ఏ.ఎస్పీ శుభం, అదనపు డిసిపిలు ప్రభాకర్ రావు,శ్రీనివాస్,సురేష్‌కుమార్, ఏసిపి సత్యనారయణ,ప్రశాంత్ రెడ్డి, సురేంద్ర,నాగయ్య, జాన్ నర్సింహులతో పాటు ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్లు సీతారెడ్డి,వెంకన్న,సుజాతతో పాటు నగరానికి చెందిన ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు,ఎస్.ఐలు పోలీస్ సిబ్బంది, స్థానిక యువత ఈ ర్యాలీ ఉత్సహంగా పాల్గోన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

## సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి



**పరకాల, జనవరి 9 (జనం సాక్షి):**పరకాల మున్సిపాలిటీలో జరగబోయే ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించి బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గాదే ప్రభాకర్ రెడ్డి పరకాల పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున పట్టణంలోనిరెండో వార్డులో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎజెండకు రావాలన్న, పరిష్కారం కావాలన్నా సిపిఎం అభ్యర్థులు గెలిస్తేనే అది సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే పట్టణంలో ఉన్న ప్రధాన సమస్యల పైన సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. పోరాటం చేస్తున్న వారికి ఓటు ద్వారా అధికారం ఇస్తే మరిన్ని సమస్యల పరిష్కారం కోసం పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రజలను కోరారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి పేదలు కష్టజీవులు నష్టం చేసే అనేక చర్యలు చేపడుతుందని ఆయన మండిపడ్డారు. ఉపాధి హామీ చట్టానికికి తూట్లు పొడిచి నిరార్ధక పథకంగా మార్చారని అన్నారు. ధరల పెరుగుదల, మహిళల మీద దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆయన మండిపడ్డారు. అందుకే ఎన్నికల్లో బిజెపిని ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బోట్ల చక్రపాణి ,నాయకులు మడికొండ ప్రశాంత్, బొచ్చు ఈశ్వర్, రాజు, కిరణ్, మహిళలు పాల్గొన్నారు.

# ఉరుసు దర్గా ఉత్సవాలు విజయవంతం చేయాలి



**వరంగల్ ఈస్ట్, జనవరి 09 (జనం సాక్షి)**వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని అండర్ రైల్వే గేట్ ఉరుసు ప్రాంతంలో ఉన్న హజరత్ సయ్యద్ షా జలాలుద్దీన్ ఖాద్రి జమాలుల్ బహోర్ (మాషుఖ్ –ఏ –రబ్బాని) 470వ ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని దర్గా పీఠాధిపతి సయ్యద్ మోహియుద్దీన్ అహ్మద్ భక్తియార్ ఖాద్రి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా హజ్రత్ సయ్యద్ జలాలుద్దీన్ షా మాషుకి రబ్బాని 470వ ఉర్సు షరీఫ్ ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈనెల 11వ తేదీన విశేష ప్రార్థనలతో మొదలై మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నగరానికి చెందిన వారే కాకుండా హైదరాబాదు, ఇతర ప్రాంతాల నుంచి అతిథులు రాబోతున్నారని అన్నారు. మొదటిరోజు ఉరుస్ ఉత్సవం ప్రారంభం కాగా రెండవ రోజు సందేల్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఉరుసు ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా స్థానికులు ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు 40వ డివిజన్ కార్పొరేటర్ మారుపల్ల రవి తెలిపారు. సమావేశంలో సయ్యద్ జమాలుద్దీన్ అహ్మద్ ఖాద్రి (ఖలీద్ పాషా), పలువురు ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన వాల్పోస్టర్లు ఆవిష్కరించారు.

# ఘనంగా ముగ్గుల పోటీలు



**నడికూడ, జనవరి 9 (జనం సాక్షి) :**హనుమకొండ జిల్లా నడికుడ మండలం పులిగిల్ల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం రోజున ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పుల్యాల సంపత్ రెడ్డి మాట్లాడుతూ ముగ్గులు భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయో గపడతాయని తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులు కటుకోజ్వల సతీష్ మాట్లాడుతూ విద్యార్థులలో కళాత్మక నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహించామని అన్నారు.ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల పబ్బ సరిత,ఉపాధ్యాయులు ఉమా, పద్మ, కవిత, ప్రదీప్, అంగన్వాడి టీచర్లు రాజేశ్వరి, సూరమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చైనా మాంజా వాడితే కఠిన చర్యలు

## బెల్లంపల్లి టూ టౌన్ ఎస్సై కిరణ్ కుమార్



**బెల్లంపల్లి, జనవరి 9, (జనం సాక్షి)**సంక్రాంతి పండుగ వేళ చైనా మాంజా వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి టూ టౌన్ ఎస్సై కిరణ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి టూ టౌన్ పరిధిలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాతి పండగ వేళ గాలిపటాలు ఎగురవేసే ఉత్సాహంలో ప్రజలు, ముఖ్యంగా యువత తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని ఆయన సూచించారు. నిషేధిత చైనా మాంజా (నైలాన్/సింథటిక్ దారం) వాడకంపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రాణాంతకమైన దారం చైనా మాంజా అని అది గొంతుకు తగిలితే కోసుకుపోయే ప్రమాదం ఉందని, గతంలో ఇలాంటి ఎన్నో విషాద ఘటనలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. పర్యావరణానికి మేలు చేసే పక్షులు ఈ దారానికి చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఫ్యాన్సీ, జనరల్ స్టోర్లలో నిషేధిత మాంజా విక్రయిస్తే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు వారు ఏ రకమైన దారం వాడుతున్నారో తల్లిదండ్రులు గమనించాలని కోరారు. తమ బ్లూ కోల్ట్స్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పలు వీధుల్లో తిరుగుతూ ప్రజలకు, వ్యాపారులకు చైనా మాంజా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారని వివరించారు.

# ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు పాత్రికేయులు

## జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరించిన పట్టణ ఎస్సై




**రామకృష్ణాపూర్, జనవరి 09(జనంసాక్షి):** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారాదులు పాత్రికేయులు అని రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై ఎల్. భూమేష్ అన్నారు. శుక్రవారం జనంసాక్షి పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలను ప్రజలకు తీసుకెళ్ళడంతో పాటు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమైనదని, మీడియా నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురిస్తూ ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణలో జనంసాక్షి పాత్రికేయులు ఈదునూరి సారంగరావు, స్థానిక పాత్రికేయులు అరెంద స్వామి, నాంపెల్లి గట్టయ్య, పిడి రాజేంద్రప్రసాద్, నెల్లూరి శ్రీనాద్ లు పాల్గొన్నారు.

# పోలింగ్ బూత్ ల పరిశీలన

**రామకృష్ణాపూర్ , జనవరి, 09,(జనంసాక్షి):** రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల దృష్ట్యా పట్టణంలో గల పోలింగ్ బూతులను శుక్రవారం మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ పట్టణ ఎస్.ఐ.ఎల్. భూమేష్, క్యాతన్ పల్లి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు పోలింగ్ బూత్ లను పరిశీలించారు. అనంతరం మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ బూత్ లలో పటిష్ట భద్రతతో పాటు మౌలిక సదుపాయాలైన విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, నీటి సరఫరా, సౌకర్యాల నిమిత్తం పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని తెలిపారు. ఈ పరిశీలనలో హెడ్ కానిస్టేబుల్ జంగు, పోలీస్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# అందుబాటులో ఆధార్ సేవలు



**నడికూడ, జనవరి 9 (జనం సాక్షి):** నడికూడ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రోజున శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సేవలు సులభంగా, సమయానుకూలంగా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రాణి, కాంగ్రెస్ పార్టీ నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, నడికుడ గ్రామ సర్పంచ్ కుడ్ల మలహల్రావు, కాంగ్రెస్ నాయకులు పర్నేం మల్లారెడ్డి, ఈర్ల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలో పలు తీర్మానాల ఆమోదం



**కాళేశ్వరం , జనవరి 10 , ( జనం సాక్షి ).** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగినది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామిణ ఉపాధి హామీ పథకం పేరును మార్పు చేయకూడదు అని సభలో తీర్మానం చేశారు. అలాగే కొత్త జాబ్ కార్డులు దరఖాస్తు చేసుకునేవారు మార్చి తర్వాత దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం గ్రామంలో ఉన్నటువంటి చెరువులకు మత్తడి మరమ్మతులు చేయాలని, చెరువులు కబ్జాకు గురి అవుతున్నాయి కాబట్టి వాటికి హద్దులు వేయాలని తీర్మానించారు. అటవీశాఖకు , రెవిన్యూకు సంబంధించిన భూములు కబ్జాకు గురై నిర్మాణాలు జరుగుతున్నాయి కావున వాటిని కాపాడాలని తీర్మానించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని , విద్యుత్ శాఖ ద్వారా జీరో బిల్ గృహ జ్యోతి పథకం దరఖాస్తు చేసుకొని వారు ఉంటే మళ్ళీ అప్లికేషన్ ఎంపీడీఓ ఆఫీస్ లో పెట్టాలని గ్రామ సభలో తెలిపారు. కాళేశ్వరం టోల్ గేట్ నిర్వాహకులు వాహనాలను పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఇతర గ్రామ సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ , ఉప సర్పంచ్ చెమాల సుధీర్ కుమార్ , వార్డు సభ్యులు రే వెల్లి రాకేష్ , నిట్టూరి మహేష్ , రేవల్లి మమత , పానం సంతోష్ , ఇమ్రాన్ , విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ఎఫ్పిఓ సభ్యత్వ నమోదు



**బెల్లంపల్లి, జనవరి 9, (జనంసాక్షి)** బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి సహకార సంఘం పరిధిలో శుక్రవారం ఎఫ్పిఓ ( ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజషన్ ) సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా సహకార అధికారి ఎం సత్యనారాయణ ఆదేశాల మేరకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యత్వం చేసుకోవాలని ఏరియా ఆఫీసర్ జీ సందీప్ కుమార్ తెలిపారు. కొత్తగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరాలనుకునేవారు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చంద్రవెల్లిలో రెండు వేల రూపాయల వాటాధనం చెల్లించి సభ్యత్వం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా మరొక రెండు వేల రూపాయలు కలుపుతుందని వివరించారు. వివిధ వ్యాపారాల నిర్వహణ వలన సంఘానికి వచ్చిన లాభాన్ని ఏటా సభ్యులకు 40 షేర్స్ లకు సంబంధించి వాటాధనం చెల్లిస్తామని వివరించారు. సమూహ మార్కెటింగ్, మెరుగైన ధరల లభ్యత, వ్యవసాయ ఇన్పుట్స్ సౌకర్యం, రుణాలు, శిక్షణ, రైతుల ఆర్థికభివృద్ధి గురించి వివరించారు. కేంద్రం ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలకు అర్హులుగా ఎంపిక చేయబడుతారని అవగాహనా పరిచారు. సభ్యత్వానికి రైతు పట్టాదారు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నంబర్ ఉండాలని అన్నారు. కన్నాల గ్రామానికి చెందిన రైతు బామాండ్లపల్లి స్వామి రెండు వేల రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందారు. ఈకార్యక్రమంలో ఆడాప్షన్ ఆఫీసర్ బి సురేందర్, చంద్రవెల్లి సహకార సంఘం కార్యదర్శి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# స్ట్రక్చరల్ బయోఫిజిక్స్‌లో ఆధునిక ధోరణులపై జాతీయ సదస్సు



**వరంగల్ బ్యూరో, జనవరి 09 (జనం సాక్షి)**వరంగల్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వరంగల్‌లోని బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో "స్ట్రక్చరల్ బయోఫిజిక్స్‌లో అభివృద్ధి చెందుతున్న ధోరణులు" (సి ఈ టి ఎస్ బి?26) అనే జాతీయ సదస్సును జనవరి 9 నుంచి 11, 2026 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ శాఖ (డిబిటి) మరియు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏ ఎన్ ఆర్ ఎఫ్) వారి ప్రాయోజకత్వం అందిస్తున్నాయి.సి ఈ టి ఎస్ బి?26 ప్రారంభోత్సవ కార్యక్రమం జనవరి 9, 2026న నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ బి. రామ రాజు అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ సౌమ్య లిప్సా రాథ్ మరియు ప్రొఫెసర్ త్యాగేశ్వర్ చంద్రన్ సదస్సు నిర్వాహకులుగా వ్యవహరించారు. ఈ సదస్సును సీఎస్ఐఆర్ (సి ఎస్ ఐ ఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ శేఖర్ సి. మందే అధికారికంగా ప్రారంభించగా, సీసీఎంబీ, హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ రాజన్ శంకరనారాయణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు."నిర్మాణం, గతి మరియు కార్యాచరణ సమన్వయం" అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహించబడుతున్న ఈ సదస్సులో ఇంటిగ్రేటివ్ స్ట్రక్చరల్ బయాలజీ, కృత్రిమ మేధస్సు ఆధారిత పద్ధతులు, ఔషధ అన్వేషణ, స్ట్రక్చరల్ బయోఇన్ఫర్మాటిక్స్ వంటి రంగాలలో తాజా పరిశోధన ధోరణులపై విస్తృత చర్చ జరుగుతోంది. దేశంలోని ప్రముఖ విద్యా మరియు పరిశోధనా సంస్థలకు చెందిన ఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తలు కీనోట్ మరియు ఆహ్వానిత ఉపన్యాసాలు అందిస్తున్నారు. మొత్తంగా సిఈటి ఎస్ బి?26 సదస్సు పరిశోధకులు, అధ్యాపకులు మరియు విద్యార్థులకు స్ట్రక్చరల్ బయోఫిజిక్స్‌లో వెలుగులోకి వస్తున్న ఆధునిక ధోరణులను అవగాహన చేసుకునేందుకు విలువైన వేదికగా నిలుస్తూ, అంతరశాఖ పరిశోధనలను ప్రోత్సహించడంలో నిట్ వరంగల్ పాత్రను మరింత బలపరుస్తోంది.

## గ్రేస్ సర్వీస్ సొసైటీ సహకారం మరువలేనిది : గడ్డి శ్రీనివాస్

### విద్యార్థులకు దుప్పట్లు ఆట బొమ్మల పంపిణీ



**మంగపేట జనవరి 09 (జనంసాక్షి)**నిరుపేద విద్యార్థులకు దుప్పట్లు, ఆట బొమ్మలను పంపిణీ చేసిన గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం వారి సహకారం మరువలేనిది అని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గడ్డి శ్రీనివాస్ కొనియాడారు. శుక్రవారం కమలాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది విద్యార్థులకు దుప్పట్లు, ఆట వస్తువులు, టాయ్స్ గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఆ సొసైటీ ఇన్చార్జి ప్రసాద్ సారధ్యంలో పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని తొండ్యాల లక్ష్మీపురం, కోమటిపల్లి, బోరు నరసాపురం, కమలాపురం పాఠశాలల్లో విద్యార్థులందరికీ చలికాలం కావడం వలన ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులు ఉంటారని భావించి వారికి దుప్పట్లు, ఆట బొమ్మలను అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రేస్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు ఇప్పటికే అనేక సందర్భాలలో బ్యాగులు, పెన్నులు, పెన్సిల్లు అలాగే దుప్పట్లు అందించడం జరిగిందని వారి సేవలను మరవలేము అని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు ఎలీషా బాబు, ఉపాధ్యాయులు ప్రసాద్, రాజేశ్వరరావు, నర్సింగరావు, ప్రేమ్ రమేష్ తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సేవాదళ్ పరకాల నియోజకవర్గ అధ్యక్షులుగా ఏరుకొండ రవీందర్ గౌడ్

**ఆత్మకూరు, జనవరి 9 (జనం సాక్షి):** కాంగ్రెస్ సేవాదళ్ పరకాల నియోజకవర్గం అధ్యక్షులుగా ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన మాజీ పిఏసిఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, ని ఎన్ని క చేస్తూ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బచ్చు చందర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో మమేకమై పార్టీ బలోపేతానికి దశాబ్ద కాలంగా రవీందర్ గౌడ్ కృషి చేస్తున్నారు. బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఒకే ఒక్క ఆత్మకూర్ ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సొసైటీని సొంతం చేసుకున్న ఘనత రవీందర్ గౌడ్ కి దక్కింది. వీటితోపాటు ఏరుకొండ చారిటబుల్ ట్రస్ట్ ద్వారాఅనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా దేశమంతా కోవిడ్ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రజలకు విద్యార్థులకు మాస్కులు, శానిటైజర్లు, వృద్ధులకు బ్రెడ్స్, పండ్లను అందించి ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన నాయకుడుగా రవీందర్ గౌడ్ పేరు తెచ్చుకున్నాడు. పార్టీ కి చేసిన సేవలను గుర్తించి సేవాదళ్ పరకాల నియోజకవర్గం అధ్యక్షులుగా నియమించింది. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ పార్టీకి తను చేసిన సేవలను గుర్తించి సేవాదళ్ పరకాల నియోజకవర్గం అధ్యక్షులుగా నియమిం చినందుకుగాను తన ఎన్నికకు సహకరించిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బచ్చు చందర్ కి కాంగ్రెస్ పరకాల నియోజకవర్గం నాయకులకు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులకు పేరుపేరునా రవీందర్ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ముందు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని రవీందర్ గౌడ్ తెలియజేశారు.




## నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

**నస్పూర్ (జనంసాక్షి):**నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమమే మా లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శుక్రవారం రోజున శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి మైదానంలో కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేఖ ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కొక్కిరాల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజాసేవచేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి నిధులు తీసుకువస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# చైనా మాంజా, లక్కీ లాటరీలు లేకుండా పటిష్టమైన చర్యలు

## నేర సమిక్షలో ఎస్పీ అఖిల్ మహాజన్




**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి):** సంక్రాంతి సందర్భంగా చైనా మాంజా జిల్లా వ్యాప్తంగా లేకుండా మరియు లక్కీ డ్రా లు, పేకాటలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఎస్పీ జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత మాసోత్సవ సందర్భంగా మైనర్ డ్రైవింగ్ జరగకుండా, లైసెన్స్ మేళా నిర్వహిస్తూ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు, బైక్ ర్యాలీ, విద్యార్థులతో నడక ర్యాలీ లాంటివి నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా నెలవారి నేర సమీక్ష సమావేశంలో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నూతన సంవత్సరం నూతన ఆలోచనలతో ప్రజలకు మరింత చేరువై పటిష్టమైన పోలీసు విధులను నిర్వర్తిస్తూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిని ఉక్కు పాదంతో అణచివేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాలను సందర్శిస్తూ ప్రజలకు చట్టాలపై, నేరాలపై, సైబర్ క్రైమ్ పై మహిళల పట్ల జరుగు అఘాయిత్యాలపై, బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి సందర్భంలోనైనా డయల్ 100 కి సమాచారం అందించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై రోడ్డు భద్రతా నియమాలు ట్రాఫిక్ నియమాలు పాటించేలా, గ్రామ గ్రామాల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా నూతన సర్పంచులను ప్రోత్సహించాలన్నారు. పోలీసు యూనిఫామ్ ద్వారా పరువు, ప్రతిష్ట, కీర్తి లభిస్తాయని దానని సక్రమంగా ధరించాలని తెలిపారు. దాబా యజమానులచే సమావేశాలు ఏర్పాటు చేసి రోడ్డుపై పార్కింగ్ జరగకుండా దాబాలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా గంజాయి మాదకద్రవ్యాలు పై అవగాహన కల్పించాలన్నారు. రాత్రి సమయాలలో ప్రత్యేకంగా బీట్ నిర్వహిస్తూ దొంగతనాలను నేరాలను అరికట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వీడీసీలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా చూడాలన్నారు. లాడ్జిలలో హోటలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. గత నెల రోజులలో జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 50 మంది పోలీస్ అధికారులకు సిబ్బందికి ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలను అందజేసి ప్రోత్సహించారు. దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలను పాటించాలని నేరస్తులకు శిక్షలు పడే విధంగా పరిశోధన కొనసాగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల రికార్డులను పరిశీలించి కేసులవారిగా పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కాజల్ సింగ్, బి సురేందర్ రావు, ఏఎస్పీ అడ్మిన్ పి మౌనిక, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డిసిఆర్బి, ఎన్ఐబి, సైబర్ క్రైమ్, ఐటి కోర్, ఫింగర్ ప్రింట్ రిజర్వేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ బి కళాశాలలో కైట్ ఫెస్టివల్

## సంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాల నిర్వహణ



**వరంగల్ ఎంజీఎం, జనవరి 9(జనంసాక్షి):**స్థానిక లాల్ బహదూర్ కళాశాల "సంస్కృతిక విభాగం" ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరిగింది . కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు అధ్యక్షతన జరిగిన ఈ పోటీలలు కైట్ ఫెస్టివల్ మరియు రంగోలి, మెహేంది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ వెల్లూరి రామచంద్రం, రిజిస్టర్ కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా కాకతీయ విషయంలో ఏ కళాశాల నిర్వహించని పతంగి పండుగను ఎల్.బి కళాశాల నిర్వహించడం సంతోషం వ్యక్తపరిచారు. మానవ జీవన గమనంలో పతంగికొక చారిత్రక నేపథ్యం ఉందని సూర్యుని గమనంలో దక్షిణాయం నుండి ఉత్తరాయానికి ప్రకృతి మార్పుకు మానవుడు జీవనగమనంలో ఆరోగ్యంగా ఉండడానికి పతంగి ఎగరవేయడం కూడా ఒక ఆరోగ్య సూత్రం మన పూర్వీకులు అందించిన వారసత్వ సంపద. కళాశాల క్రీడా మైదానంలో అట్టహాసంగా రిజిస్టర్ పతంగినెగిరేసి విద్యార్థిని విద్యార్థులను అబ్బురపరిచారు. ఎంతో ఆనందాన్ని వ్యక్తపరిచారు. డాక్టర్ కే రాజేందర్రెడ్డి,సంస్కృతిక విభాగం కన్వీనర్ సామల సతీష్ కుమార్, వి .మధుకర్ రావు, ఎస్వి రమణారెడ్డి, హరిణి, మమత, ప్రియాంక, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ రఘువెందర్ రెడ్డి, శ్రీనివాస్,నూతనంగా ఏర్పడిన కాన్వాస్ క్లబ్ మెంబర్స్, అధ్యాపకులు, ఆధ్యాపకేతర ,సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 9 (జనంసాక్షి):**మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, శ్రీనిధి రీజినల్ మేనేజర్ వెంకటరమణ లతో కలిసి శ్రీనిధి రుణాలు, బ్యాంకు లింకేజ్ ల మంజూరు, రికవరీల పై జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, సెర్ప్ ఆధ్వర్యంలోని శ్రీనిధి సిబ్బంది, సామాజిక సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అన్ని రంగాలలో రాణించేందుకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. జిల్లాలో 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను శ్రీనిధి రుణాల లక్ష్యం 42 కోట్ల రూపాయలకు గాను 46 శాతంతో 19 కోట్ల 47 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రికవరీలో భాగంగా 49 శాతం రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రికవరీ పరంగా 25వ స్థానంలో కొనసాగడం జరుగుతుందని, జిల్లాలో తక్కువ రికవరీ ఉన్న మండలాల ప్రతినిధులు రికవరీ శాతాన్ని పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకు లింకేజీ విషయంలో 422 కోట్ల రూపాయలకు గాను 311 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ చేయడం జరిగిందని, ఓవర్ డ్యూ 0.68 శాతంగా నమోదు అయిందని, ఈ క్రమంలో సమగ్రమైన ప్రణాళిక రూపొందించుకుని తక్కువ ప్రగతి సాధించిన మండలాలు వృద్ధి సాధించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకుల వద్ద నుంచి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇందులో మొదటి బ్యాచ్ లో ప్లంబింగ్, శానిటేషన్ పై నెల రోజుల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం జరుగు తుందని తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయసు గల గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో డిమాండ్ ఎక్కువగా ఉన్న పనులకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నూతన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

## స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్ పూర్,జనవరి 09 ( జనం సాక్షి ) :**నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభి వృద్ధి కోసం, అవినీతి, అక్రమాలకు దూరంగా ప్రజల సంక్షేమానికి పని చేస్తే నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు తెలిపారు. చిల్పూర్ మండల కేంద్రం లోని వరలక్ష్మిగార్డెన్స్ లో ఏర్పాటుచేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎక్కడా అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా సంక్షేమ పథకాల ను అమలు చేస్తున్నామని తెలిపారు. కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న 3 నెలలో చెక్కులు అందజేస్తున్నామని, ఇందుకు ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే తనకు చెప్పాలని సూచించారు.రాష్ట్రంలో పేద వర్గా ల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందని అన్నారు. మనం ఎంత బాగాపనిచేస్తామో ఎంతనిజాయితీగా ఉంటామో దానిని బట్టే ప్రజలలో గుర్తింపు ఉంటుందని అన్నారు. త్వరలోనే చిల్పూర్ మండల కేంద్రంలో మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని తెలిపారు. వాటి నిర్మాణం ఏడాదిలో పూర్తి చేసి మండల ప్రజలకు బహుమానంగా అందజేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చిల్పూరు గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, తహసీల్దార్, ఎంపిడివో, ఫతేపూర్ సర్పంచ్ గుగులోతు లక్ష్మి ఉమ్లా నాయక్, నాయ కులు సురేష్, బాలరాజు, రంజిత్ రెడ్డి, మల్లారెడ్డి సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చల్లా సుధీర్ రెడ్డి సన్మానించిన పాఠశాల యాజమాన్యం

**స్టేషన్ ఘన్ పూర్, జనవరి 09 ( జనం సాక్షి ) :**మండలంలోని తాటికొండ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో వివిధ అభివృద్ధి పనులకు విరాళాలు అందజేసిన దాతలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్,వార్డు సభ్యు లకు సన్మానాన్ని ఘనంగానిర్వహించారు. ఉన్నత పాఠశాలలో సభా ప్రాంగణాన్ని ఏర్పాటుచేసిన దాత చల్లా సుధీర్ రెడ్డిని, నూతన గేటు ఏర్పాటు చేసిన2000 -2001 పదవ తరగతివిద్యార్థులను పాఠశాల నూతన బోర్డు ఏర్పాటుచేసిన రిటైర్డ్ టీచర్ రుద్రమదేవిని పాఠశాలలో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ మారపాక సృజన, ఉపసర్పంచ్ ఎడమ కట్టుమళ్లు,వార్డుసభ్యులందరినీ ఈ కార్య క్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెనుమాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి లోభాగమైన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మరికొంతమంది దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్ర, లింగ మూర్తి, రంజిత్ కుమార్, శ్రీనివాస్, రవీందర్, మురళి, అనసూయ, కృపమ్మ, సలావుద్దీన్, ప్రమోద్ రెడ్డి, రవి, సువర్ణ, గ్రామస్తులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# పాపయ్యపేట ఊర చెరువు సాగునీటి విడుదల

## పాపయ్యపేట గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్



**చెన్నారావుపేట, జనవరి 9 ( జనం సాక్షి):** పాపయ్యపేట ఊర చెరువు సాగునీటిని గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్ విడుదల చేశారు. ఊర చెరువు తూర్పు కాలువ నుండి యాసంగి పంటల కోసం శుక్రవారం సాగునీటిని వదిలారు. సాగునీటిని రైతులు పంటల కోసం పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ లింగాల సారంగం, వార్డు సభ్యులు మరుపల వీరస్వామి, గుర్రం రవి, బండి రమేష్, రైతులు కట్టయ్య, ఇంద్రారెడ్డి, వెంకన్న, యాకయ్య, ప్రతాప్ రెడ్డి, రాంబాబు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి క్రీడాజ్యోతి కార్యక్రమం

## అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు సర్పంచ్ అక్షరాభ్యాసం



**మహాదేవపూర్ : జనవరి 9 (జనం సాక్షి).**ముఖ్యమంత్రి కప్ 2026 క్రీడాజ్యోతి కార్యక్రమం ర్యాలీని నిర్వహించడం జరిగింది. శుక్రవారం రోజు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి, శ్రీ పాద ప్రధాన కూడలి వరకు, క్రీడాజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథి గ్రామ సర్పంచ్ హసీనా అక్బర్, గౌరవ అతిథిగా జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాబు, ఉప సర్పంచ్ శ్రీజ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అలాగే క్రీడ అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు16 సంవత్సరాలకు పైబడిన క్రీడాకారులందరూ, గ్రామ పంచాయతీల సెక్రటరీల వద్ద తమ పేరు నమోదు, జనవరి 17వ తేదీ వరకు నమోదు కొరకు సదుపాయం కలిగించడం జరిగింది. మండలంలోని గ్రామపంచాయతీల వారిగా ముఖ్యమంత్రి క్రీడలు 21.22వ తేదీ ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో, క్రీడల నైపుణ్యాన్ని పెంపొందించి, వారికి రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరిచే అవకాశాలను కల్పించడం జరుగుతుందని, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం, మానసిక ఒత్తిళ్లకు దూరం చేస్తూ విద్య అభ్యాసం, మరింత పటిష్టతగా, ఉత్తీర్ణతకు దృఢమైన నమ్మకం సంకల్పాన్ని కలిగిస్తుందని, తెలిపారు.అనంతరం మహదేవపూర్ 8 వ అంగన్వాడి కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ ఉప సర్పంచ్ శ్రీజ చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ కార్యకర్త. ఆయాలు చిన్నారులు తల్లిదండ్రులు హాజరయ్యారు. అక్షర అభ్యాసం కార్యక్రమం అనంతరం సర్పంచ్ ఉప సర్పంచ్ కు, సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు పాఠశాల ఉపాధ్యాయులు కాలేజీ అధ్యాపకులు విద్యార్థులుపాల్గొన్నారు.

# రోడ్ సేఫ్టీపై ప్రత్యేక చర్యలు

## డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం



**ములుగు బ్యూరో,జనవరి09(జనం సాక్షి):**రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో,లయన్స్ క్లబ్ సహకా రంతో ములుగు జిల్లా డీటీఓ కార్యాలయంలో శు క్రవారం రోజున ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఈఐబీ,ఆటో ,టాటా మ్యాజిక్, లారీ డ్రైవర్లకు నిపుణ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి చుక్కలు,మందులు అందజేశారు.వాహనాలు నడిపే డ్రైవర్లకు కంటి ఆరోగ్యం ఎంతో కీలకమైనదని,రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆర్ టి ఓ శ్రీనివాస్ అధికారులుఈ సందర్భంగా పేర్కొన్నారు. కంటి చూపులో లోపాలు ఉన్న డ్రైవర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉండటంతో, ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం అవసరమని సూచించారు.అదే విధంగా, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు వెంకటాపూర్ మండలంలోని జోహార్ పాఠశాలలో పాదచారుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత,పాదచారుల భద్రత వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు.రోడ్డు భద్రత అనేది డ్రైవర్లకే కాకుండా పాదచారులు, విద్యార్థులు సహా ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న వయసు నుంచే రోడ్డు నియమాలపై అవగాహన కల్పిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. ములుగు జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారిం చేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# అంబర్ గుట్కా అక్రమ రవాణాపై ఉక్కుపాదం

## మాదక ద్రవ్యాల పై కఠిన చర్యలు.. సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్

**ఆత్మకూరు, జనవరి 9 (జనం సాక్షి):** ప్రభుత్వం నిషేధించిన అంబర్, గుట్కా, తంబాకు అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ హెచ్చరించారు. శుక్రవారం ఆత్మకూరు మండలం గూడెప్పాడు గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహించగా అంబర్, గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్న హుజురాబాద్ కు చెందిన గోవింద్, మహమ్మద్ అప్సరీ బేగం ను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. మేడారం జాతరకు గుట్కా తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం నిషేధించిన మాదక ద్రవ్యాలను అక్రమంగా తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# అయోడిన్ పై శిక్షణ అవగాహన కార్యక్రమం



**పర్వతగిరి జనవరి 09 :(జనం సాక్షి)** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లా వెల్ఫేర్ అధికారి వరంగల్ అనుమతితో సంయుక్తంగా నిర్వహించిన అయోడిన్ పై శిక్షణ అవగాహన కార్యక్రమం కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్ ఉర్సు కరీమాబాద్ నందు ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ ఐటిసి సహకారంతో ఆశీర్వాద స్మార్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య కార్యకర్తలకు , మెక్మా ఆర్పి లకు అయోడిన్ లోపము వల్ల ఏర్పడే రుగ్మతలు మరియు అయోడిన్ సాల్ట్ ప్రాముఖ్యతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్ కుమార్ మాట్లాడుతూ అయోడిన్ లోప నివారణ ప్రతి ఇంటి నుండి మహిళలు ప్రారంభించాలని, మహిళలు చైతన్యవంతులై అయోడిన్ పై అవగాహన కలిగితే అయోడిన్ లోపం వలన అలసట ,బరువు తగ్గడం, మానసిక రుగ్మతలు రావడం, గర్భవతులకు గర్భాస్రావం జరగడం, చలికి తట్టుకోకపోవడం, గయిటర్ రావడం, హైపో థైరాయిడిజం రావడం, జుట్టు ఊడిపోవడం, జ్ఞాపకశక్తి తగ్గడం ,చాలా అనారోగ్య సమస్యలు ఏర్పడడం జరుగుతుందని తెలిపారు . ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి కుటుంబం అయోడైడ్ ఉప్పును వాడాలని తెలిపారు .అనంతరం రిసోర్స్ పర్సన్ కార్తీక్ మాట్లాడుతూ అయోడిన్ సాధారణంగా లభించే పాల ఉత్పత్తి పదార్థాలు, కోడిగుడ్ల , సిఫుడ్ ,మాంసకృతుల ,కూరగాయల , పండ్ల ద్వారా లభిస్తాయని అవే కాకుండా అయోడైడ్ ఉప్పు వాడిన సరిపోతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో భాగంగా ఐ జి డి జిల్లా కోఆర్డినేటర్ నల్లబెల్లి రాజు మాట్లాడుతూ సాధారణ ఉప్పుకు అయోడైడ్ ఉప్పుకు ఉన్న వ్యత్యాసాలు గుర్తించడానికి చక్కటి ప్రయోగ ఉదాహరణల ద్వారా టెక్నిక్స్ నేర్పారు. ప్రతి కుటుంబము సమతుల్య ఆహారము తీసుకోవడం వలన కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, ఫ్యాట్స్ ,విటమిన్స్ మినరల్స్, ఫైబర్, ద్రవపదార్థాలను ఎక్కువ ఉండేటట్లు తీసుకొని అయోడైడ్ సమస్య రాకుండా ఉండాలని కోరారుస్థానిక కార్పొరేటర్ పల్ల రవి మాట్లాడుతూఇక్కడ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు అయోడిన్ ఉప్పును వాడి ,అయోడైడ్ ఉప్పు పైన సరియైన మూతలు బిగించి అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఉపయోగించుకోవాలని, అయోడిన్ ప్రాముఖ్యత తెలుసుకున్న విషయాలను సమాజంలో ప్రజలకు తెలియజేసి అయోడిన్ లోపల సమస్య రాకుండా జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల సూపర్వైజర్ సోమేశ్వర్ ,ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, రిసోర్స్ పర్సన్స్ ,సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి: కుంజా సూర్య



**మంగపేట జనవరి 09 (జనంసాక్షి)**క్రీడలు ఆడడం వలన మానసిక ఉల్లాసం, ఆరోగ్యాన్ని కలగజేస్తాయని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కుంజా సూర్య అన్నారు. శుక్రవారం మండలం లోని రాజుపేట గ్రామంలోని పాత సినిమా హల్ నందు కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో అంబెడ్కర్ యూత్ వారిచే నిర్వహించిన ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క కుమారుడు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కుంజా సూర్య హాజరై రిబ్బన్ కట్ చేసి టోర్నమెంట్ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ రోజుల్లో కొందరు యువతచెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని అలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని అలాగే ఏదైనా ఒక క్రీడను ఎంచుకొని క్రీడల్లో రాణించాలని వారు సూచించారు. అలాగే యువత క్రీడల్లో రాణిస్తూ ములుగు జిల్లా కు మంచి పేరు తెచ్చే విధంగా క్రీడా స్ఫూర్తిని పొందాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాంరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సర్ ఖాన్, నియోజకవర్గ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, కొంకతి సాంబశివరావు, నల్లెల భరత్ కుమారస్వామి, జిల్లా, నియోజకవర్గం, బ్లాక్ కాంగ్రెస్, మండల సీనియర్ నాయకులు, అంబెడ్కర్ యూత్ తదితరులు పాల్గొన్నరు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులారా కబడ్దార్

## జనగామ జిల్లా బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు,



జనగామ ప్రతినిధి, జనవరి 9(జనం సాక్షి): తెలంగాణ జాతిపిత కెసిఆర్, కేటీఆర్ ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమనీ, మా అదినాయకుని కట్ అవుట్ కు ఉరితీశారు కానీ మా కెసిఆర్ ఒక్క పిలుపునిస్తే సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీని తరిమి తరిమి కొడతామని హెచ్చరించారు.జనగామ జిల్లా బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు, నిన్న జనగామలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు ప్రదర్శించిన అత్యుత్సాహం, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నేడు జనగామ ఆర్టీసీ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి, సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కట్ అవుట్ లను ఉరి తీసి, హార్పిక్ తో కట్ అవుట్ లను కడిగి నిరసన తెలిపారు.తిఈ కార్యక్రమంలో జనగామ టౌన్ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో అశోక్ నగర్ లో సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలు ఉద్యోగులకు ఇచ్చిన హామీ ఏమయిందని, రేవంత్ రెడ్డి ఇచ్చిన 420 హామీలను పక్కనబెట్టి ప్రతీ క్షణం కెసిఆర్, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని, ఇకనుండి ఆ మాటలను సాహించేది లేదని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒకటి తిడితే మేము వంద మాటలు తిట్టడానికి సిద్ధమయ్యామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ నాయకులు ఎండి.అన్వర్, తిప్పారపు విజయ్ ,ఎండీ జానీ, నల్ల వినోద్,నోముల శ్రవణ్ , చెన్నూరి వంశీ, కన్నారపు వంశీ, కర్రె అరుణ్, ఇరుగు సిద్ధులు, ప్రశాంత్ ,ఎండి. రిజ్వాన్, నర్ర నవీన్, కన్నెబోయిన నరేష్, ప్రసాద్ , ఎండి యాకుబ్, హంజాద్, యాకూబ్,దండు ఉపేందర్, ఈశ్వర్,తదితరులు పాల్గొన్నారు.

# చర్చి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు కారల్ మార్క్స్ కాలనీలో శుక్రవారం రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న కల్వరి గాస్పర్ చర్చి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని మతాలూ సమాజానికి శాంతి, ఐక్యత, సేవా భావాన్ని బోధిస్తాయన్నారు. ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చే విధంగా చర్చి నిర్మాణం జరగడం ఆనందకరమని అన్నారు. మత సామరస్యాన్ని కాపాడటం సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు.



**దైనందినిని ఆవిష్కరించిన ఎమ్మెల్యే..**

భూపాలపల్లి కారల్ మార్క్స్ కాలనీలోని శ్రీ సాయిబాబా ఆలయంలో నూతనంగా ముద్రించిన దైనందినిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయిబాబా బోధనలు సమాజానికి శాంతి, సేవా భావం, మానవత్వాన్ని ప్రసాదిస్తాయని అన్నారు. దైనందిని ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలు, పూజా విధానాలు మరింత చేరువవు తాయని తెలిపారు. భక్తి, నైతిక విలువలు పెంపొందే కార్యక్రమ ాలకు తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

**వీఆర్ ఫ్యామిలీ మార్ట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే..**

భూపాలపల్లి పోలీస్ స్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వీఆర్ ఫ్యామిలీ మార్ట్(పీపుల్స్ స్టోర్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రారంభించారు. యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా బలపడాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు.

**సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే..**

భూపాలపల్లి క్రిష్ణకాలనీ లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. చిన్న వయసులోనే క్రీడల్లో ప్రతిభను వెలికితీసేలా ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. క్రీడాకారులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, మౌలిక వసతులపై ఎమ్మెల్యే వివరించారు.




## నూతన పాలక వర్గానికి ఘన సన్మానం

**దస్తురాబాద్, జనవరి 09 (జనంసాక్షి) :** ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామ పాలక వర్గానికి పెర్కపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తరుపున సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుంగూరి వెంకట్రాజం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న సమస్యలను పాలక వర్గానికి తెలియపరచడం జరిగిందని ఆయన అన్నారు. గ్రామ ఉపసర్పంచ్ బోడకుంటి నరేష్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని, వార్డ్ సభ్యులందరిని సంప్రదించి పాఠశాలలో కావాల్సిన మౌలిక సదుపాయాలు సమకూరుస్తామని అన్నారు. అనంతరం ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులను ఘనంగా శాలువాతో సన్మానం చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు గోపు పుష్ప, గడికొప్పుల లత, ఎల్ల వనిత, చుంచు శంకరమ్మ, బొడ్డు అంజన్న ఉపాధ్యాయురాలు రాధిక, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పన్ లక్ష్మి, గ్రామ కారోబార్ రవి, ఐకెఆర్పి లు జగన్, ఉదయ్,గ్రామ పెద్దలు భూమన్న, రాజన్న, సుధాకర్, నగేష్, అక్షయ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు

● **మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి**

**రామకృష్ణాపూర్, జనవరి 09(జనంసాక్షి) :** పట్టణంలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా దారం విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ శశిధర్ రెడ్డి హెచ్చరించారు. రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని, రామకృష్ణాపూర్ పట్టణంలోని బీ–జోన్ సెంటర్, రాజీవ్ చౌక్ పరిసర ప్రాంతాల్లోని పలు దుకాణాలను సీఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులతో మాట్లాడి, ప్రభుత్వం చైనా మాంజా దారం ను పూర్తిగా నిషేధించిందని తెలిపారు. గతంలో పతంగులు ఎగురవేసే సమయంలో మాంజా దారం వాడటం వల్ల అనేక మంది ప్రజలు, పక్షులు, వాహనదారులు తీవ్రంగా గాయపడిన సంఘటనలు చోటు చేసుకున్నాయని, కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారని సీఐ గుర్తు చేశారు. అందువల్ల రామకృష్ణాపూర్ పట్టణంలోని ఎలాంటి దుకాణాల్లోనూ చైనా మాంజా దారం అమ్మకాలు జరగకుండా యజమానులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే పట్టణంలోని యువకులు, పిల్లలు పతంగులు ఎగురవేసే సమయంలో చైనా మాంజా దారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించ చకూడదని, పండుగను ప్రశాంతంగా, సుఖసంతోషాల మధ్య భద్రంగా జరుపుకోవాలని సూచించారు.



ఈ తనిఖీ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డితో పాటు రామకృష్ణాపూర్ ఎస్సై ఎల్. భూమేష్, హెడ్ కానిస్టేబుల్ జంగు, పట్టణంలోని పలు దుకాణ యజమానులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై దిగజారుడు ఆరోపణలు సరికాదు

● **నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్**



**బెల్లంపల్లి, జనవరి 9, (జనంసాక్షి) :** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పై దిగజారుడు ఆరోపణలు సరికాదని బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్ ఖండించారు. గురువారం ఒక టీవీ ఛానెల్ లో ఎమ్మెల్యేపై దిగజారుడు ఆరోపణలు చేశారని అవి నిజం కాదని అన్నారు. పాత్రికేయులు నిజానిజాలు గ్రహించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని అన్నారు. లేనిపోని ఆరోపణలు చేయడం వల్ల సూర్యునిపై ఉమ్మేసిన చందంగా తిరిగి వాళ్ళ ముఖంపైనే పడుతుందని అన్నారు. నీతికి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అయిన ఎమ్మెల్యేను కుసంస్కారం, కుత్సిత బుద్ధితో చిత్రీకరించడం దారుణం అన్నారు. గత పదేళ్ల పాలనలో అభివృద్ధి పడకేసి అవినీతి, అక్రమాలు రాజ్యమేలిన నోరు మెదపని కొన్ని చానళ్ళు, పత్రికలు నేడు విషపు రాతలు రాసి ప్రజల మనసులను కలుషితం చేసే పనిలో పడ్డాయని విమర్శించారు. సమస్యలను వెలికితీసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన ప్రసార మధ్యమాలు రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారి విషపు రాతలతో ప్రజల మనసులను కలుషితం చేస్తే ప్రజలే దూరం పెడతారని అన్నారు.

# ముందస్తుగా సంక్రాతి పండుగ సంబురాలు

**దస్తురాబాద్, జనవరి 9 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా సంక్రాతి పండుగ సంబురాలు శుక్రవారం ఘనంగా నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట వేణు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంక్రాతి పండుగ కి భోగి మంటలు వేసి సంబురాలు జరుపుకున్నామని, పిల్లలతో నృత్యాలు చేపించామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వాహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందచేశామని తెలిపారు.



### ఆదివాసీ సాంప్రదాయాలకు నిలువుటద్దం

# మేడారం జాతర



రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే విధంగా స్థానిక మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో వనదేవతల మేడారం జాతరను వందల సంవత్సరాలుగా నిలిచే విధంగా రాతి శిలలతో ఆలయాన్ని తీర్చి దిద్దుతున్నారు. సుమారు 101 కోట్ల రూపాయలతో ఆలయ నిర్మాణాలను చేపట్టారు అలాగే మరో 150 కోట్లతో పరిసరాల అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఆదివాసుల సాంప్రదాయ ఆచారాలకు నిలువుటద్దంగా మేడారం రూపురేఖలనే రాష్ట్ర ప్రభుత్వం మారుస్తున్న తరుణంలో ఆదివాసుల గుండెల్లో ఆనంద ఉత్సవాన్ని నింపుతుంది. మేడారం అంతా ఆదివాసీయుల మూలపురుషుల యొక్క కళాకృతులతో ప్రత్యేక శోభను సంతరించుకుంటుంది. తెలంగాణలో మహా కుంభ మేళాగా జరుగుతునున్న మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈ సారీ ప్రత్యేకతను సంతరించుకోనుంది. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కళాకృతులను ఏర్పాటు చేసి జాతర కు వచ్చే భక్తులను ఆకట్టుకునేలా మేడారం పరిసర ప్రాంతాలు మారిపోయాయి. శతాబ్దాల కాలంనాటి కట్టడాలను తలపించేలా మేడారం రూపు రేఖలు మార్చుకుంటుంది. 21 శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఈ మహా జాతరను సక్సెస్ చేసే విధంగా నిరంతరం కృషి చేస్తున్న తరుణంలో అధికారులు పూర్తిస్థాయిలో నిమగ్నమై పనులను నిర్వహిస్తున్నారు. ఈనెల 18 తేదీలోపు అన్ని పనులను పూర్తి చేసి మహా జాతరను విజయవంతం చేస్తామని జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రి సీతక్క, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ లు తెలిపారు.

## కొత్తకొండ జాతరకు వేళాయె

రావి,ఉసిరి ఉన్నాయి.ఫిబ్రవరి,మార్చి నెలలో రాలిపడే రుద్రాక్షల కోసం భక్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తారు. బ్రహ్మోత్సవాల్లో రుద్రాక్ష చెట్టును భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటారు.

**ఆర్టీసీ ప్రత్యేక బస్సులు**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జాతరకు స్పెషల్ బస్సులు నడిపిస్తున్నది. వరంగల్-1 డిపో నుంచే కాకుండా హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోల నుంచి నేరుగా కొత్తకొండకు స్పెషల్ బస్సులు నిరంతరం నడుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో అడుగడుగునా సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా జాతర ప్రాంగణంలో నలువైపులా రూట్మ్యాప్ ఫ్లెక్సీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.ఎవరైనా బ్రహ్మోత్స వాల్లో దారి తప్పితే రూట్మ్యాప్ ఆధారంగా గమ్యం చేరుకునేలా సదుపాయం కల్పిస్తున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో 400 మంది వరకు పోలీసులు విధులు నిర్వర్తిస్తారని ఆయన తెలిపారు.అడుగడుగునా పోలీసులు పహారా,గస్తీ నిర్వహించనున్నారు.

**నేడు స్వామివారి కల్యాణం..**

నేటి సాయంత్రం జరిగే వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామివారి కల్యాణ మండపంలో ఈ మహోత్సవం వైభవంగా జరుగనుంది.భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని ఆలయ ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు కోరారు.

**భక్తులకు అన్ని సదుపాయాలు..**

ఉత్సవాల్లో భక్తుల కోసం అన్ని సదుపాయాలు కల్పించాం. తాగునీటితో పాటు స్నానాల గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం.పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.వృద్ధుల కోసం వాహనాలు సమకూర్చుతాం. భక్తుల సౌకర్యార్థం పూర్తి వసతులు కల్పిస్తు న్నాం. వైద్యశిబిరం, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

- ఆలయ ఈవో కిషన్ రావు


# పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



పర్వతగిరి లయోల పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు


నెక్కొండలోని మాంటిసోరి పాఠశాలలో భోగి మంటలు


తొర్రూర్‌లో సమత సొసైటీ ఆధ్వర్యంలో రంగోలి పోటీలు


నిర్మల్ జిల్లా కేంద్రంలో విజయ పాఠశాలలో..


ఖానాపూర్ మండలం బాదనకుర్తి పాఠశాలలో..


సారంగాపూర్ మండలంలోని వింధ్య స్కూల్‌లో..

## 12న జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జాబ్ మేళా..

మహబూబాబాద్ ప్రతినిధి, జనవరి 9 (జనం సాక్షి) : మహబూబాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల జనవరి 12, 2026న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి. రజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో శ్రీరామ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులకు నియామకాలు చేపట్టనున్నారు. మహబూబాబాద్, కేసముద్రం, గూడూరు, మరిపెడ, సీరోల్, కురవి, గార్ల, బయ్యారం, చిన్నగూడూరు ప్రాంతాల్లో పనిచేయడానికి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ అర్హత కలిగి, 20 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పురుష అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 12న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు రూమ్ నెంబర్ 25, రెండో అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (నూతన కలెక్టరేట్), కురవి రోడ్, మహబూబాబాద్లోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జరిగే జాబ్ మేళాకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్‌తో హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని ఈ సందర్భంగా తెలిపారు.

## సారంగాపూర్ పాత్రికేయుల కార్యవర్గం ఎన్నిక

**సారంగాపూర్,జనవరి9 (జనంసాక్షి) :** సారంగాపూర్ మండలం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా చిన్నోళ్ల రాజకుమార్ రెడ్డి (ఆంధ్రప్రభ), ఉపాధ్యక్షులుగా చౌహాన్ ప్రకాష్ (జనం సాక్ష), ప్రధాన కార్యదర్శిగా మహిపాల్ చంద్రశేఖర్ (నమస్తే తెలంగాణ), ప్రచార కార్యదర్శిగా షేక్ కైసర్ (సూర్య), కోశాధికారిగా చంద్రమోహన్ గౌడ్ (సోషల్ మీడియా), గౌరవాధ్యక్షుడిగా ఆడెపు శ్రీనివాస్ (మన తెలంగాణ), సలహా సభ్యులుగా పి సిద్దూ ఈనాడు, వి నవీన్ వి6 వెలుగు, కొండా రమేష్ ఆంధ్రజ్యోతి, షేక్ పహీం రహనుమా ఈ దక్కన్, సభ్యులుగా భోజన్న ఆర్. సాక్షి, ఏ లక్ష్మనారాయణ నవతెలంగాణ, దోడ భోజన్న,వెన్నెల వాక్కు, టీ భోజన్న,ప్రజా జ్యోతి, టీ నిఖిల్ విజన్ ఆంధ్ర, రాజేశ్వర్ వార్త, విశ్వేశ్వర్ గౌడ్ జననేత్రం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఘనంగా మిట్టపల్లి జన్మదిన వేడుకలు



**చిట్యాల, జనవరి 09(జనం సాక్షి) :** సినీ గేయ రచయిత మట్టితల్లి మిట్టపల్లి సురేందర్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో మిట్టపల్లి మిత్రమండలి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి ఘనంగా నిర్వహించారు.అనంతరం స్థానిక సివిల్ ఆసుపత్రి లో రోగులకు పండ్లు, బ్రెడ్లు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్ల సతీష్ కుమార్ మాట్లాడుతూ మిట్టపల్లి సురేందర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఎల్లపుడు బాగుండాలి అని సినీ రంగంలో గొప్ప స్థాయిలో ఉండాలి అని కోరుకున్నట్లు తెలిపారు. సురేందర్ రానున్న రోజులలో రాజకీయంలోకి వచ్చి పేదలకు సహాయం చేయాలి కోరారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి మిత్రమండలి సభ్యులు మాసు రాకేష్, బొజ్జపల్లి శంకరయ్య, బండపల్లి దేవన్న, పాల శంకర్, దప్పు సత్తి, కాసార్ల రాజేష్, అక్రం,ఆసుపత్రి డాక్టర్ సూపరెన్డెంట్ శ్రీకాంత్ ,డ్యూటీ డాక్టర్ నివేదిత ఆసుపత్రి సిబ్బంది , కటుకూరి నరేందర్, చంద్ర శేఖర్, ఉప్పుల కిరణ్, కుమార్, ఆకుల రాజు, సూపర్వైజర్ కళ్యాణ్ కిషోర్,తదితరులు పాల్గొన్నారు.

## ఓసీల సింహగర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి..

**ఓసి జేఏసీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి..**



**చెన్నారావుపేట, జనవరి 9 (జనం సాక్షి) :** ఓసీల సింహగర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఓసి జేఏసీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో ఓసీల సింహ గర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓసీల సింహ గర్జన భారీ బహిరంగ సభను ఈనెల 11వ తేదీన ఆదివారం హనుమకొండ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ భారీ బహిరంగ సభలో గ్రామాలలోని ఓసి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట రెడ్డి సంఘం మండల అధ్యక్షులు గోపు శ్రీనివాస్ రెడ్డి, అంద్ర రాంరెడ్డి, జున్నుతుల మహేందర్ రెడ్డి, కంది నారాయణరెడ్డి, ఎనగందుల రాజిరెడ్డి, గోపు మోహన్ రెడ్డి, ఎడ్ల రాజిరెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి, కంది శంకర్ రెడ్డి, పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి మేము సైతం : ఎస్ఐ రాజ్ కుమార్




**కొత్తగూడ జనవరి 9 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్‌ను కోనాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ కుంజ బిక్షపతి,బ్లాక్ ఉప అధ్యక్షులు కర్ర జనార్దన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించడం జరిగింది.గ్రామాలలో శాంతి భద్రతలు సజావుగా ఉండేలా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా నూతన సర్పంచులు పనిచేయాలని స్థానిక ఎస్సై అన్నారు.గ్రామాల అభివృద్ధిలో పోలీసు సైతం ఉంటామని తెలిపారు.మండల ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుభాష్ రెడ్డి, రాజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎంఈఓ మేనక

**పాఠశాలలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ....!**



**మంగపేట జనవరి 09(జనంసాక్షి) :** విద్యార్థులకు సీఎం కప్ మండల స్థాయి క్రీడలను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మండల విద్యాశాఖ అధికారి పొదెం మేనక సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమలాపురం కాంప్లెక్స్ ప్రాధాన్య ఉపాధ్యాయుడు గడ్డి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేందర్, వెంకటేశ్వర్లు, నరేష్, శ్యాం ప్రసాద్, సుజాత తో పాటు మండల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించిన ఉప సర్పంచ్



**రేగొండ, జనవరి 09(జనం సాక్షి) :** మండలంలోని నారాయణపూర్ గ్రామ అంగన్ వాడీ కేంద్రాలను ఉప సర్పంచ్ మోటం మోనిక-రాజశేఖర్ శుక్రవారం సందర్శించారు. పౌష్టికాహారం ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని, పాలు,గ్రుడ్లు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శివరాజు, జ్యోత్స్న గ్రామ నాయకులు ఎల్లవుల రాజు,కన్నెబోయిన భాస్కర్,అంగన్వాడీ కార్యకర్త రావుల మాలతి,పరిజాతం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



**పాలకుర్తి, జనవరి 09(జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నింబధనలు పాటించాలని జనగాం జిల్లా ఆర్టిఏ జీ.వీ.ఎస్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, విద్యార్థులు రోడ్డు భద్రత నిబంధనలపై ఆవగాహన కలిగి ఉండాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండని బాలురు మోటార్ సైకిల్ నడపరాదన్నారు. ప్రతి విద్యార్థి రోడ్డు భద్రతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ జానకీరాంరెడ్డి, ఎస్సై పవన్ కుమార్, అసిస్టెంట్ వెహికల్ ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, నాగరాజు, సర్పంచు కమ్మగాని విజయ, ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు మద్యం అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సి.ఐ.కు వినతిపత్రం అందజేత

**మహబూబాబాద్ ప్రతినిధి, జనవరి 9 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని వైన్స్ షాపులు సిండికేట్‌గా మారి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ గూడూరు మండలం బంధాలగడ్డ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు బానోత్ హుస్సేన్ నాయక్ గూడూరు ఎక్సైజ్ అధికారి ఎన్. బిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండలంలో ఉన్న నాలుగు వైన్స్ షాపులు కలిసి సిండికేట్‌గా ఏర్పడి, కనకదుర్గ వైన్స్ షాపు (గెజిట్ నెం.56) పై స్టిక్కర్ వేసి ప్రభుత్వ నిర్ణయించిన ఎంఆర్పీ ధరలకంటే అధికంగా మద్యం విక్రయిస్తున్నారని తెలిపారు.ఓసి క్వార్టర్‌కు ఎమ్మార్పీ రూ.160 ఉండగా రూ.180లకు, ఐ బి క్వార్టర్‌కు ఎమ్మార్పీ రూ.190 ఉండగా రూ.210లకు విక్రయిస్తున్నారని, అన్ని రకాల మద్యంపై ఒక్కో క్వార్టర్‌కు రూ.20 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారని వివరించారు.